728) కన్నడగౌళ

ప॥ ఇంతసేసెబో దైవ మింతలోననే అయ్యో। సంతపాకలంజ దెచ్చి సన్యాసి జేసె॥

చ॥ పరిగెలేరేటివాని బట్టపురాజుగా। బిరతభోగములిచ్చి నిలిపినట్లు।
ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు। అరయ నిత్తడి దెచ్చి యపరంజి జేసె॥

చ॥ కుక్కలవండుకతినే కులహీనుని దెచ్చి। వెక్కసపుబాపని గావించినయట్లు।
దిక్కులెఱగగ గష్టదేహిని నన్ను దెచ్చి। గక్కన దెలుకపిండి కస్తూరిసేసె॥

చ॥ చెడుగైనదోమ దెచ్చి సింహపుగొదమగా। బెడిదంపు బ్రేమతోడ బెంచినయట్లు।
కడునధముని వేంకటపతి నను నిటు। చిడిపిరాయి దెచ్చి చింతామణిసేసె॥